క్లుప్తంగా

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న సీహెచ్‌వో రామ్మూర్తి

కోటపల్లి: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని క్లస్టర్ హెల్త్ అధికారి రామ్మూర్తి విద్యార్థులకు సూచించారు. పార్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారంపై అవగాహన కల్పించారు. దోమలు పుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమకాటుతో వ్యాప్తి చెందే వ్యాధులపై వివరించారు. రక్తహీనత రాకుండా జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యోగేశ్వర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్, వర్ష, పుష్ప పాల్గొన్నారు.

దోమలమందు పిచికారీ

మంచిర్యాలటౌన్: జిల్లాలో దోమలతో పెరుగుతున్న సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థులు దోమల బారిన, డెంగీ వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు గాను దోమల మందును స్ప్రే చేశారు. డెంగీ కేసులు జిల్లావ్యాప్తంగా పెరుగుతుండడంతో దోమల మందును పిచికారీ చేస్తున్నటు వైద్య సిబ్బంది తెలిపారు.

'బెల్లంపల్లి టికెట్ కాంగ్రెస్‌కే కేటాయించాలి'

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో బెల్లంపల్లి టికెట్ కాంగ్రెస్ పార్టీకే కేటాయించాలని బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, సీపీఐ పార్టీలు పొత్తులో బెల్లంపల్లి టికెట్‌ను సీపీఐకి ఇస్తే ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందని బెల్లంపల్లి టికెట్‌ను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలుస్తామని సూచించారు.

డీటీడీవో నీలిమను విచారించాలి

మంచిర్యాలటౌన్: జిల్లా ఇన్‌చార్జి డీటీడీవోగా పనిచేస్తున్న నీలిమను, ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలగించడంతో పాటు, ఆమెపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ), వంచిత్ బహుజన్ ఆఘాడి(విబిఏ) రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఇన్‌చార్జి డీటీడీవోగా ఉన్న నీలిమ స్థానంలో కరీంనగర్ డీటీడీవోగా ఉన్న గంగారాంకు బాధ్యతలు అప్పగించారని, నీలిమ పనిచేసే సమయంలో చాలా అవినీతి ఆరోపణలు వచ్చాయని, వాటన్నింటిపై ఏసీబీ, విజిలెన్స్ అధికారుల ద్వారా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఏడుగురికి జరిమానా

భీమిని: భూ తగాదాల్లో ఏడుగురు వ్యక్తులకు మంచిర్యాల పబ్లిక్ ప్రాసిక్యూటర్, సీనియర్ సివిల్ జడ్జి సోమవారం రూ.10,500జరిమానా విధించారు. పోలీసుల కథనం ప్రకారం.. 2017 సంవత్సరంలో కన్నెపెల్లి మండలం జజ్జరవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దాంపూర్ గ్రామానికి చెందిన ఫిర్యాదుదారుడు బూర్ల పద్మ, బూర్ల భూమయ్య కులాంతర వివాహం, భూ తగాదాలు మనుసులో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు మారణాయుధాలతో ఇంట్లోకి ప్రవేశించి దాడి చేసిన ఘటనలో నిందితులు తలండి అశోక్, ఎదుల భూమయ్య, మేక సురేష్, దుగిని కిట్టు, తలండి రాజు, అర్కం చంద్రయ్య, తలండి సుధాకర్‌కు ఒక్కొక్కరికి రూ.1500చొప్పున రూ.10,500జరిమానా విధించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

బాధ్యతలు స్వీకరణ



స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

భీమారం: స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాల పీజీ హెడ్మాస్టర్‌గా దర్శన్ విక్రమ్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు సర్పంచ్ గద్దె రాంరెడ్డితోపాటు పాఠశాల ఉపాధ్యాయులు కొత్తగా బాధ్యతలు చేపట్టిన విక్రమ్‌కుమార్‌ను సన్మానించారు.

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ నూతన గెజిటెడ్ హెచ్‌ఎంగా యోగేశ్వర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాఠశాలకు వచ్చిన ఆయనకు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి స్వాగతం పలికారు.

ముప్పై నాలుగేళ్ల ఐక్యత

- బస్తీలో ఏకైక వినాయక మండపం
- ఐక్యత చాటుతున్న కాలనీవాసులు
- అరమరికలు లేకుండా నవరాత్రి ఉత్సవాలు

బెల్లంపల్లి: ప్రస్తుత సమాజంలో మానవుల మధ్య ఈర్ష్యాద్వేషాలు, ఓర్వలేనితనం, కంటగింపు.. అంతకు మించి ఆధిపత్య ధోరణి సర్వసాధారణమయ్యాయి. పోటాపోటీగా ఉత్సవాలు నిర్వహించడం చూస్తున్నాం. కలిసికట్టుగా జరిపే ఉత్సవాలు దాదాపు కానరావడం లేదు. కానీ బెల్లంపల్లి మున్సిపాలిటీలోని శాంతిఖని బస్తీవాసులు ఇందుకు భిన్నంగా వినాయకుడి ఉత్సవాలు నిర్వహిస్తూ ప్రత్యేకత చాటుకుంటున్నారు. 34 ఏళ్ల నుంచి ఒకేపంథా అనుసరిస్తున్నారు. ఆత్మీయత, అనురా గాలను పెంపొందించుకుని ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఏళ్ల తరబడిగా ఒకే మండపం

ఏప్రాంతంలో చూసినా ఇబ్బడి ముబ్బడిగా వినాయకుడి మండపాలు ఏర్పాటు చేసి వీధికో వినాయకుడిని ప్రతిష్ఠిస్తున్నారు. పోటాపోటీగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తూ అనైక్యతను చాటుకుంటున్నారు. శాంతిఖనిబస్తీ వాసులు మాత్రం ఐక్యతకు మారుపేరుగా నిలుస్తున్నారు. 34 ఏళ్లుగా బస్తీలో ఒకే వినాయక మండపం ఏర్పాటు చేసి మతసామరస్యతను కాపాడుతున్నారు. బస్తీలో 400 సింగరేణి క్వార్టర్లు, 60 వరకు ప్రైవేటు గృహాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 2,500 వరకు జనాభా నివాసం ఉంటున్నారు. 40 శాతం సింగరేణి కార్మికులు, 60 శాతం కార్మికేతరులు ఉన్నారు.



శాంతిఖనిలో ఏర్పాటు చేసిన వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

కలిసికట్టుగా ఉత్సవాలు

బస్తీ పేరుకు తగ్గట్టుగానే శాంతియుతంగా కుల, మత, వర్గ, వైషమ్యాలకు తావులేకుండా చిన్నాపెద్ద తారతమ్య భేదంలేకుండా అన్యోన్యంగా, ఆనందోత్సాహాలతో నవరాత్రి వేడుకలు నిర్వహించడంలో తమకు తామే సాటిగా నిలుస్తున్నారు. ఒకరి ఇష్టాఇష్టాలను మరొకరు గౌరవిస్తూ భేదాభిప్రాయాలు రాకుండా సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. అందుకే 34 ఏళ్లుగా వినాయక ఉత్సవాలు నిర్వహించడంలో సఫలీకృతమవుతున్నారు.

బస్తీ భౌగోళిక పరిస్థితుల రీత్యా..

శాంతిఖని బస్తీ భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా వినాయక మండపాన్ని సమష్టి నిర్ణయంతో మారుస్తున్నారు. బస్తీ మధ్యలో ఉన్న వాగు బస్తీని రెండు భాగాలుగా విభజిస్తుంది. వాగుకు ఒకవైపు 150, మరోవైపు 250 క్వార్టర్లు ఉన్నాయి. ఉత్సవాలు నిర్వహించడానికి రెండు వైపుల నుంచి కమిటీ సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బస్తీ మొత్తం కిలోమీటర్ మేర విస్తరించి ఉండడంతో మూడేళ్లపాటు ఒక వైపున, మరో మూడేళ్లపాటు మరోవైపున ఆరేళ్లక్రితం వరకు వినాయకుడిని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహిస్తూ వచ్చారు. ఆ తర్వాత కమిటీ నిర్వాహకులు సమన్వయంతో మాట్లాడుకుని ఓ ప్రాంతాన్ని ఎంపిక చేసి శాశ్వతంగా ఉత్సవాలు నిర్వహించడానికి మండపం నిర్మించారు. వినాయకుడిని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మూడు దశాబ్దాల పైబడి నుండి అదే ఒరవడి కొనసాగుతోంది.

ఒకేచోట శాశ్వత మండపం



గతంలో మూడేళ్లు ఒక వైపు మరో మూడేళ్లు మరోవైపు వినాయక మండపాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చేది. కాలనీవాసుల నిర్ణయంతో ఒకేచోట శాశ్వత మండపం నిర్మించి ఉత్సవాలు జరుపుకుంటున్నాం. 34 ఏళ్లుగా కులమతాలకు అతీతంగా, కలిసికట్టుగా నవరాత్రి ఉత్సవాలు జరుపుతున్నాం. బస్తీ ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.

– సాధుల వేణు, శాంతిఖని బస్తీవాసి, బెల్లంపల్లి

ఐక్యతతోనే సాధ్యం

ఒకే బస్తీ.. ఒకే వినాయకుడు అనే ఐక్యతతో 34 ఏళ్లుగా కాలనీలో ఒకే వినాయక విగ్రహం ఏర్పాటు చేస్తున్నాం. నాటి నుండి నేటి వరకు ఆ ఆనవాయితీని తప్పలేదు. నవరాత్రి ఉత్సవాలకు ముందు కమిటీ సభ్యులంతా కలిసి ఏర్పాట్ల కోసం చర్చించుకుని తగిన నిర్ణయం తీసుకుంటాం. ఆ ప్రకారంగానే ఉత్సవాలు నిర్వహించి ఐక్యతను ప్రదర్శిస్తున్నాం. కేవలం బస్తీవాసుల ఐక్యతతోనే ఒకే వినాయక విగ్రహం సాధ్యమవుతోంది.

– దుర్గం జ్ఞానయ్య, శాంతిఖని బస్తీవాసి, బెల్లంపల్లి

భీమారంలో 48ఏళ్లుగా...



భీమారం: మండలంలోని సాయిరాం యూత్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో 48ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. మొట్టమొదటగా పాత పోస్టాఫీస్ ప్రాంతంలో వినాయక మండపం ఏర్పాటు చేసి అందులో వినాయక ప్రతిమ నెలకొల్పి ఉదయం, సాయంత్రం పూజలు చేసేవారు. అది ఇప్పటికీ కొనసాగుతోంది.

పాత జ్ఞాపకాలు గుర్తుకొస్తాయ్..

గ్రామంలో మొదట ఏర్పాటు చేసిన వినాయడి మండపాన్ని ఇప్పటికీ మరిచి పోను. యువకుడిగా ఉన్న సమయంలో గ్రామంలో వినాయక మండలి ఏర్పాటు చేశారు. అప్పట్లో నవరాత్రుల సందర్భంగా హరికథలు చెప్పించేవారు. అందరూ ఒకే చోటికి వచ్చి భజనలు చేసేవారు.

– మేరడగొండ మురళీ, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

ప్రాముఖ్యత పెంచేలా చూస్తాం

పెద్దలు నెలకొల్పిన వినాయక మండపం ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపడుతాం. భారీ విగ్రహం ఏర్పాటు చేసి జిల్లాలోనే పేరు సాధిస్తాం. గతంలో కన్నా యువకుల్లో భక్తిపై ఆసక్తి పెరిగింది.

– అనిల్‌గౌడ్, యువకుడు, భీమారం

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

లక్సెట్టిపేట: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చైర్మన్ నల్మాసు కాంతయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు సబ్బులు, నూనెలు, దుస్తులు అందించుటకు, ఇటిక్యాల ప్రాంతంలో బస్తీదవాఖాన ఏర్పాటు చేయుటకు స్థల పరిశీలనపై చర్చించారు. తాగునీటి సమస్యలు రాకుండా ఎప్పటికప్పుడు మరమ్మతు చేయుటకు పైప్‌లైన్ బోర్‌వెల్ మెటీరియల్ గురించి తీర్మానం చేశారు. ఇప్పటివరకు నిర్వహించిన పనులు భవిష్యత్‌లో చేయాల్సిన పనులపై అధికారులతో చర్చించారు. అనంతరం పదకొండో వార్డులో ఇటీవల మంజూరైన డీఎంఎఫ్‌టీ నిధులు రూ.32లక్షలతో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం పనులను చైర్మన్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాడేటి శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ రాజశేఖర్, మేనేజర్ శ్రీహరి, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాల్గొన్న చైర్మన్ కాంతయ్య

కోడిగుడ్ల ట్రాలీని అడ్డుకున్న అంగన్‌వాడీలు



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి నుంచి మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు తరలిస్తున్న కోడిగుడ్ల ట్రాలీని అంగన్‌వాడీలు సోమవారం అడ్డుకున్నారు. మంచిర్యాల నుంచి బెల్లంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లను ట్రాలీలో తరలిస్తున్నారనే సమాచారంతో అంగన్‌వాడీలు కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంతంలో ట్రాలీని అడ్డుకుని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కొద్ది సేపటి తర్వాత ఆ ట్రాలీ అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లిపోయింది. దీంతో అంగన్‌వాడీలు దీక్షా శిబిరానికి చేరుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు భానుమతి, ప్రధాన కార్యదర్శి రాజమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

చెన్నూర్: విద్యార్థులకు చదువుతో పాటు చట్టాలపై అవగాహన అవసరమని చెన్నూర్ జూనియర్ సివిల్ జడ్జి సంపత్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకోవాలో తెలిపారు. కార్యక్రమంలో ఏజీపీ ఆకుదారి రాంభావు, హెచ్‌ఎం కరుణాకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

తాండూర్: విద్యార్థినులు చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖీ కేంద్రం సభ్యులు విజయ, భారతి అన్నారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో సోమవారం మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే సఖీ కేంద్రం, హెల్ప్‌లైన్ నంబర్ 181కు సమాచారం అందిస్తే తక్షణ సాయం అందిస్తామన్నారు.

లంబోదరుడికి ప్రత్యేక పూజలు



మంచిర్యాలఅర్బన్: ఉండ్రాళ్లతో వినాయకుడికి ప్రత్యేక పూజలు



దండేపల్లి: శివగణేశ్ భక్తమండలి వద్ద గణనాథుడికి 108 రకాల నైవేద్యాలు

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో వినాయకుడికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేశ్ మండపాల వద్ద కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఏజోన్, బీజోన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండళ్ల వద్ద సోమవారం గణనాథుడికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. పూజల అనంతరం అన్నదానం చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథ ఆలయ కాలక్షేప మండపం ఆర్యవైశ్య గణేశ్‌మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి 2లక్షల 50వేల ఉండ్రాళ్లతో పూజ నిర్వహించారు. గణనాథుడికి ఇష్టమైన పదార్థాలతో లక్ష వస్త్రం మోదుకలతో పూజ జరిపారు. రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దండేపల్లి: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథుల వద్ద నిత్యపూజలు కొనసాగుతున్నాయి. కుంకుమపూజలు, నిత్య అన్నదానాలు నిర్వహిస్తున్నారు. దండేపల్లి శివగణేశ్ భక్తమండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడి వద్ద సోమవారం 108రకాల నైవేద్యాలు సమర్పించి, పూజలు చేశారు.

టీఎస్‌పీఎస్సీ రద్దు చేయాలని నిరసన

మంచిర్యాలఅగ్రికల్చర్: టీఎస్‌పీఎస్సీ రద్దు చేయాలని బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు, నాయకులు రాజేష్, బోడ్డు వినోద, మద్దెల భవాని, రాజు తదితరులు పాల్గొన్నారు.

'గ్రీన్‌వుడ్'పై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: సీబీఎస్ పేరుతో ఘరాన మోసం చేస్తున్న గ్రీన్‌వుడ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని టీజేఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీజేఎస్ నాయకులు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. అధిక ఫీజులు వసూలు చేస్తు తల్లిదండ్రులను వేధిస్తున్న గ్రీన్‌వుడ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రీన్‌వుడ్ పేరెంట్స్ కమిటీ సభ్యులు దివ్య, వనిత, ప్రసన్న, అరుణ్‌కుమార్, రాజేష్, అబ్జల్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తాండూర్: మండలానికి నిరుపేద కుటుంబానికి చెందిన నాయిని నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయనతో పాటు విద్యాభారతి పాఠశాలలో 2001–2002సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న తోటి స్నేహితులు రూ.70వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పీఈటీ శ్రీనివాస్, మిత్రులు దుర్గం మహేందర్, రమేష్, రాజేష్, జనార్దన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకురాలు అమరాజుల శ్రీదేవి డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలో అంగన్‌వాడీలు చేపడుతున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

కాసిపేట: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. కళ్లకు గంతలు కట్టుకొని అంగన్‌వాడీలు నిరసన తెలిపారు.

మంత్రులను కలిసిన ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు

బెల్లంపల్లి: కొత్తగా నియామకమైన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి సభ్యులు రాష్ట్ర మంత్రులను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లో సోమవారం రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, రాష్ట్ర మంత్రులు హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిలను కలిశారు. రాష్ట్ర మంత్రులను కలిసిన వారిలో ఇతర సభ్యులతో పాటు బెల్లంపల్లికి చెందిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ ఉన్నారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఉన్నారు.

ఘనంగా దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి

తాండూర్/మందమర్రిరూరల్: బీజేపీ నేత దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

సంక్షిప్త వార్తలు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

జైపూర్/లక్సెట్టిపేట/కోటపల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ రజిత అన్నారు. కోటపల్లి రైతువేదికలో సోమవారం పోషణమాస దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లక్సెట్టిపేటలోని సత్యసాయి నగర్‌లో పౌష్టికాహారం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. జైపూర్ మండలంలోని వేలాలలో అంగన్‌వాడీ కేంద్రం–1లో ప్రత్యేకంగా ఆహారపదార్థాలు, చిరుధాన్యాలతో ప్రదర్శన నిర్వహించి పోషకాహారంపై అవగాహన కల్పించారు.

క్రాప్ డ్రాపన్ ఆప్‌పై అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు సోమవారం క్రాప్ డ్రాపన్‌పై అవగాహన కల్పించారు. ఈ ఆప్‌తో రైతులకు వ్యవసాయ సంబంధిత వివరాలు తెలుగులో తెలుసుకునేందుకు ఉపయోగ పడుతుందని తెలిపారు. అనంతరం పత్తి, వరి పంటలలో ఆశించే చీడ, పీడల నివారణ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈవో సాయికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

వేమనపల్లి: పోషణ మాస వారోత్సవాల సందర్భంగా వేమనపల్లిలో సోమవారం సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు ఎంపీడీఓ లక్ష్మయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వేణుమాధవ్ పౌష్టికాహారం అందజేశారు.

ప్రజలకు అవగాహన

భీమిని: కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా కన్నెపల్లి మండల కేంద్రంలో సోమవారం ఎస్సై నరేష్ ప్రజలకు అవగాహన కల్పించారు.

'అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు'

వేమనపల్లి: అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని చెన్నూర్‌రూరల్ సీఐ విద్యాసాగర్ అన్నారు. మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా జాజులపేటలో సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. వాహనపత్రాలు లేని 42బైక్‌లు, రెండు ఆటోలు, ఒక జీప్‌ను సీజ్ చేశారు.

బతుకమ్మ చీరల పంపిణీ

నస్పూర్: పట్టణ పరిధిలోని 1, 2, 3, 4, 5,16వార్డుల్లో కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సెక్రటరీ కొక్కిరాల సురేఖ మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

చిత్రలేఖనం పోటీలు

పాతమంచిర్యాల: బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవం అక్టోబర్ 01 పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బాయ్స్ హైస్కూల్‌లో సోమవారం బీఎస్ఎన్ఎల్ అధికారులు 1–5 తరగతులు చదివే విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

'అభయ' యాప్ స్టిక్కర్ ఆవిష్కరణ

నస్పూర్: పట్టణ పరిధిలోని ప్రతీ ఆటోకు 'అభయ' యాప్ క్యూ ఆర్ బార్ కోడ్ స్టిక్కర్ ఉండాలని సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపారు. సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో 'అభయ' యాప్ క్యూఆర్ బార్ కోడ్ స్టిక్కర్లను ఆవిష్కరించారు.

మొక్కలు అందజేత

చెన్నూర్: పట్టణంలోని దేవాలయాలకు హరితహారం కార్యక్రమంలో భాగంగా మారేడు మొక్కలను పంపిణీ చేసినట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ స్వప్న తెలిపారు. మొక్కలను ఆలయాల ప్రాంగణంలో నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజేశ్‌కచ్వా, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

లక్సెట్టిపేట: మండలం కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బియ్యాల తిరుపతి, మోదెల మాజీ ఉపసర్పంచ్ రవి, బీజేపీ మహిళా నాయకురాలు సునిత, సుమారు రెండు వందల మంది కార్యకర్తలు సోమవారం కొక్కిరాల ప్రేంసాగర్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.

పెన్షనర్స్ భవన్‌లో వైద్య శిబిరం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం పెన్షనర్స్ భవన్‌లో విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత ఆక్యుప్రెషర్ థెరపీ న్యాచురోపతి వైద్య శిబిరం నిర్వహించారు. 60మంది రోగులు దీర్ఘకాలిక వ్యాధులు, అధిక బరువు, బీపీ, షుగర్, కంటి సమస్యలు, గుండె సమస్యలు, థైరాయిడ్, కీళ్ల నొప్పులు, ఆస్తమా, నిద్రలేమి, ఆసిడిటీ తదితర వ్యాధిగ్రస్తులు చికిత్స కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి ఈ నెల 29వరకు ప్రతిరోజూ చికిత్స అందించనున్నట్లు తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు క్రిష్ణ, ప్రధాన కార్యదర్శి జగన్ తెలిపారు. కార్యక్రమంలో ఆక్యుప్రెషర్ థెరపిస్టులు మలాంసింగ్, గోస్వామి, తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వైకుంఠం కనకయ్య, జనార్దన్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

చెన్నూర్: పట్టణంలో మంగళవారం నిర్వహించే గణేశ్ నిమజ్జనంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ గంగాధర్, సీఐ వాసుదేవరావు అన్నారు. నిమజ్జన ఘాట్‌తో పాటు రూట్లను అధికారులు, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు పరిశీలించారు. నిమజ్జన ఘాట్‌తో పాటు ప్రధాన కూడళ్లలో ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఘాట్ వద్ద జాలర్లను నియమించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి: ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకురాలు అమరాజుల శ్రీదేవి డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలో అంగన్‌వాడీలు చేపడుతున్న దీక్షా శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించి మద్దతు తెలిపారు.